నారా—ఎట్లు తప్పును! పితృమారకమునకు బట్టవలసిన దుర్యోగము లింతకు మించిన విక లేవు. ప్రత్యక్షనిదర్శితమైన జ్యోతిశ్శాస్త్రము నేడత్యద్భుతముగ విపరీతఫలముల నొసగునెడల,—రవ్యాదిగ్రహము లొక్కచోట్టున తారుమారులై పోవునెడల—నీతడీ గండము దప్పి జీవించిన జీవింపవచ్చును. నామాట బూటకమైన గావచ్చును.—అని నారాయణశాస్త్రి కంఠోక్తిగ వక్కాణించెను. ఇంతగ జెప్పుచున్నపుడిక నూరకొనరాదని మిత్రులందఱు వివిధరీతుల బోధించి యేకగ్రీవముగ బట్టుపట్టగ నెట్టకేలకు విధిలేక దామోదరరావు సరే! మీ యిష్టమని తలయూపెను.

సాంబశివరావు తత్క్షణమె డాక్టరుకొఱకు బరుగెత్తెను. నిత్యానందము పోస్టాఫీసునకు బరుగెత్తి దామోదరరావు కొడుకునకు తంతివార్త నంపివచ్చెను. నగరాజము కలము గాగితము దీసి దామోదరరావుచేత మరణశాసనము వ్రాయించెను. ఆవల దండ్రికి కాఫీ యిచ్చుటకు వచ్చినసావిత్రి గదితలుపు మూయబడియుండుటచే దలుపురంధ్రములనుండి లోనికి జూచి గదిలోనివారి సంభాషణముల నించుక విని యావృత్తాంత మావంత గ్రహించి యాత్రముతో నక్కకడకు బోయి జరిగిన చర్యయంతయు దెలిపెను. జానకి తత్తరపాటుతో వాకిటిలోనికి వచ్చుసరికి సాంబశివరావుతో డాక్టరు లోనికి వచ్చెను. ఆతని జూచినతోడనే యక్కచెల్లెండ్ర మనోభయము హెచ్చెను.

డాక్టరు గదిలోని కరిగి దామోదరరావు ప్రక్కను కుర్చీపై గూరుచుండి, మీశరీరమున నేమయిన బాధ యున్నదా? యని ప్రశ్నించెను. లేదని యాతడు ప్రత్యుత్తర మిచ్చెను. పిదప హృదయకోశము, నాడీగతి మున్నగునవి పరీక్షించి యన్నియు నారోగ్యస్థితియందున్నవనియు, లేశమైన భయపడవలసిన నిమిత్తము లేదనియు డాక్టరు హెచ్చరించెను. నారాయణశాస్త్రి గడియారము వంక జూచి యింకను గంటపై నలుబదిరెండు నిమిషముల వల కట్లే! యని పలికెను. అందఱు గడియారమువంక జూచిరి. అప్పటికి మూడుగంటల పదునెనిమిదినిమిషములైనది. డాక్టరొక్క నిముస మెద్దియొ యోచించి, యిందఱు జన మీగదిలో నుండుట యనారోగ్యకరమనియు, దామోదరరావు, దానుదప్ప మిగిలినవారందఱు గదివెలుపల నిశ్శబ్దముగ గూరుచుండవలయుననియు బలికెను. అందఱు లేచివచ్చి సావడిలో గూరుచుండిరి. వచ్చునపుడు నారాయణశాస్త్రి దామోదరరావుతో హరి నామస్మరణమాటమాత్రము మరువవలదని హెచ్చరించెను.

జానకీ సావిత్రులు తొట్రుపాటుతో సావడిలోనికి వచ్చితండ్రికిమూడనున్న కీడు నారాయణశాస్త్రి ప్రభృతుల వలన సమగ్రముగ విని గుండెలు మోదుకొనుచు నేడువజొచ్చిరి. దానితో నగ్నిజ్వాలవలె నావార్త క్షణములో నిల్లంతయు వ్యాపించెను. గదిలో రంగదాసుచే నుత్తరములు వ్రాయించుచున్న జగ్గమ్మ పరుగుపరుగున వచ్చి యల్లుని మారకయోగవార్త విని నెత్తి మొత్తుకొనుచు పురిటిగదిలోనికి బోయి మీనాక్షిని గౌగిలించుకొని యామెతో గలసి పెద్దపెట్టున నేడ్వజొచ్చెను. రంగదాసీమాట విని కూల బడిపోయెను. డాక్టరీవలకు వచ్చి గోలచేయుచున్నందున నందఱను మందలింప జొచ్చెను. ఆతని వెనువెంటనే దామోదరరావీవలకు రాగా బుత్రిక లాతని బిగ్గఱగ గౌగిలించుకొని బోరున నేడ్వసాగిరి. తన కేమియు భయము లేదని చెప్పి దామోదరరావు వారల నూరడింపుచున్నపుడాతని కనుగొలుకులనుండి వేడికన్నీటిబొట్లు పుత్రికల శిరములపై రాలజొచ్చెను. డాక్టరది గనిపెట్టి దామోదరరావును గదిలోనికి దీసికొనిపోయెను. దామోదరరావు మిత్రులు కన్నీరు దుడిచికొనుచు జానకీ సావిత్రుల నోదార్చి. పై కేడువవలదని చెప్పి వారిగదిలోనికి బంపివైచిరి. జగ్గమ్మ బాలికలయొద్దకు వచ్చి మీరు ధైర్యము దెచ్చికొని పిన్నిని గనిపెట్టుడమ్మా యని చెప్పి వారిని పురిటిగుమ్మముకడ గూరుచుండబెట్టి, సంసార మెంతలో నెట్టియవస్థకు వచ్చునోయని భయపడుచు నన్నిగదులకు గప్పుతాళములు వైచి, యల్లుని జీవనభారము దేవునిపై వైచి యావకాయ గూనల భారము తనపై వైచికొని, యొక్కొక్క గూనయే వినుకటింటి కొట్టులోనికి జేర్చుచుండెను.

